సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కరుటూరి పానకాలు దంపతులు (అంకంపాలెం) మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి యల్లాపంతుల ప్రవీణ్‌కృష్ణ దంపతులు (విశాఖపట్నం) మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సెహరీ గురు (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.34
కాకినాడ	6.25	4.34
అమలాపురం	6.25	4.34

న్యూస్‌రీల్

ఓటు నమోదుకు ఇప్పటికీ అవకాశం



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఫారం-6 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇప్పటికే నమోదైన ఓటర్లు తమ చిరునామా మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ లోగా ఈసీఐ వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, రానున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుకు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేశారు. కొత్తగా నమోదైన, చిరునామా మారిన, బదిలీ అయిన ఓటర్ల వివరాలను అనుబంధ ఓటరు జాబితాలో పొందుపరుస్తామని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా గిడుగు

సాక్షి, రాజమహేంద్రవరం: రానున్న ఎన్నికల్లో పోటీ చేసే ఎంపీ, ఆరుగురు ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా అమలాపురానికి చెందిన పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజును ఎంపిక చేశారు. అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ యల్లా శ్రీనివాసరావు, రాజానగరానికి ముదురు వెంకట శ్రీనివాస్, రాజమహేంద్రవరం సిటీకి బోడా లక్ష్మి వెంకట ప్రసన్న, రూరల్‌కు బాలేపల్లి మురళీధర్, కొవ్వూరుకు అరిగెల అరుణకుమారి, నిడదవోలుకు పెద్దిరెడ్డి సుబ్బారావును ఖరారు చేశారు.

మూడుసార్లు వాటర్ బెల్ తప్పనిసరి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశానుసారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మూడుసార్లు వాటర్ బెల్ కొట్టాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థులు విధిగా తగినంత మంచినీరు తాగాలని సూచించారు. దీనికోసం పాఠశాలల్లో ఉదయం 8.45, 10.05, 11.50 గంటలకు వాటర్ బెల్ కొట్టాలని తెలిపారు. విద్యార్థులందరూ విధిగా మంచినీరు తాగేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

టీడీపీ ఇన్‌చార్జిగా చౌదరి వద్దు

సీతానగరం: టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకట రమణ చౌదరి వద్దని, విదేశాలకు వెళ్లిపోతూ టీడీపీలోకి గద్దె వెంకట కృష్ణచౌదరి(నల్లి)ని ఆహ్వానించడం పెద్ద తప్పని మండల టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతానగరం బస్టాండ్ వద్ద ఉన్న రాజు కల్యాణ మండపంలో వారు మంగళవారం సమావేశం నిర్వహించారు. వెంకట రమణ చౌదరి పార్టీ కండువా వేసి గద్దె నల్లిని టీడీపీలోకి ఆహ్వానించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ హయాంలో ముఖ్య అనుచరుడిగా ఉంటూ పార్టీ నాశనమవడానికి ముఖ్య కారకుడైన గద్దె వెంకట కృష్ణచౌదరి పార్టీలో చేర్చుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేష్ పేరు చెప్పుకొని వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన నల్లి మళ్లీ టీడీపీలోకి రావడం ఏమిటని మండిపడ్డారు. నల్లిని టీడీపీలో చేర్చి వెంకట రమణ చౌదరి విదేశాలకు వెళ్లిపోయారని, రానున్న రోజుల్లో ఆయన కూడా పార్టీకి వెన్నుపోటు పొడవరనే గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు.

పాఠశాలలు ఒక్క పూటే నిర్వహించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న రీత్యా జిల్లాలోని పాఠశాలలన్నింటినీ ఒక్క పూట మాత్రమే నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు ఆదేశించారు. విద్యార్థులు అనారోగ్యం, వడదెబ్బకు గురి కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో రెండో పూట తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వడదెబ్బ తగిలినా, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అనంతర చర్యలకు బాధ్యులవుతారని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయులు పీహెచ్‌సీ నుంచి కనీసం 20 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తమ వద్ద ఉంచుకోవాలని, అవసరమైనప్పుడు వాటిని విద్యార్థులకు, సిబ్బందికి వెంటనే అందజేయాలని సూచించారు. వడదెబ్బ నివారణ మందులు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రికార్డు బ్రేక్

2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్ల వివరాలు

వ్యవసాయ మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లు)	వసూలు (రూ.కోట్లు)	శాతం
నిడదవోలు	1.25	2.53	202
రాజానగరం	2.24	3.14	140
కొవ్వూరు	3.69	5.04	136
గోపాలపురం	2.63	3.47	132
అనపర్తి	12.76	13.26	104
రాజమహేంద్రవరం	3.79	3.25	86
మొత్తం	26.36	30.70	116.52

- సెస్ వసూళ్లలో జిల్లా ముందంజ
- 2023-24లో 116.52 శాతం వసూలు
- నిడదవోలు ఏఎంసీలో ఏకంగా 220 శాతం వసూళ్లు



రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీల (ఏఎంసీ) ఆధ్వర్యాన వ్యవసాయ ఉత్పత్తులపై సెస్, మార్కెట్ ఫీజు వసూళ్లలో రాష్ట్రంలోనే మన జిల్లా ముందంజలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.26.36 కోట్లు లక్ష్యం కాగా మార్చి నెలాఖరుకు ఏకంగా రూ.30.70 కోట్లు వసూలు చేసి, రికార్డు బ్రేక్ చేశారు. జిల్లావ్యాప్తంగా 116.52 శాతం మేర మార్కెటింగ్ ఫీజులు వసూలయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాలపై ఒక శాతం సెస్ వసూలు చేస్తున్నారు. వీటితో పాటు వ్యాపారుల (ట్రేడర్లు) నుంచి ఒక శాతం, చేపలు, రొయ్యలపై 0.25 శాతం చొప్పున సెస్ వసూలు చేస్తున్నారు. నిడదవోలు ఏఎంసీ రూ.1.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.2.53 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. ధాన్యంతో పాటు సెస్ వసూళ్లు ఇబ్బడి ముబ్బడిగా సాధించడంతో నిడదవోలు ఏఎంసీ ముందంజలో నిలిచింది. రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాత్రం సెస్ 86 శాతమే వసూలు చేసి వెనుకంజలో ఉంది.

ఐదు ఏఎంసీలు వంద శాతం పైనే

జిల్లాలో ఆరు ఏఎంసీలు ఉండగా.. ఐదింటిలో వంద శాతం పైనే సెస్ వసూళ్లు జరిగాయి. నిడదవోలు 202 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, రాజానగరం ఏఎంసీ 140 శాతంతో ద్వితీయ, కొవ్వూరు 136 శాతం వసూళ్లతో తృతీయ స్థానంలో నిలిచాయి. గోపాలపురం ఏఎంసీ 132 శాతం, అనపర్తి ఏఎంసీ 104 శాతం వసూళ్లతో 4, 5 స్థానాల్లో నిలిచాయి.

పక్కా ప్రణాళికతో..

మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లపై మార్కెట్ కమిటీ సిబ్బందికి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిర్దిష్టమైన సూచనలు ఇస్తూ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా జిల్లాలోని ఆరు మార్కెట్ కమిటీల పరిధిలో 14 చెక్ పోస్టుల ద్వారా ఏకంగా 116.52 శాతం మేర మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లు సాధించారు. కాకినాడ జిల్లా నుంచి అనపర్తి, రాజమహేంద్రవరం ఏఎంసీలకు బకాయిలు రావాల్సి ఉంది. దీనికి పౌర సరఫరాల బకాయిలు కూడా తోడవడంతో రాజమహేంద్రవరం ఏఎంసీ లక్ష్య సాధనలో వెనుకబడింది.

లక్ష్యాన్ని అధిగమించాం



జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లు 116.52 శాతం సాధించాం. మార్కెటింగ్ శాఖ కమిషనర్, రీజినల్ డైరెక్టర్ సూచనలతో లక్ష్యాన్ని అధిగమించాం. మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సిబ్బంది సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధించగలిగాం. జిల్లాలో వెనుకబడిన రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ నూరు శాతం లక్ష్యం సాధించేలా కృషి చేస్తాం.

– ఎం.సునీల్ వినయ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి

'తీస్రా అష్ర'తో అల్లాహ్ సాన్నిహిత్యం

- ముగిసిన మగ్ఫిరత్
- ప్రారంభమైన తీస్రా అష్ర
- ముగింపు దశ అంకంలోకి పవిత్ర రంజాన్
- నరకం నుంచి విముక్తి కోరడమే చివరి పది రోజుల విశిష్టత
- వారం రోజుల్లో సంపూర్ణం కానున్న ఉపవాస దీక్షలు



రాజమహేంద్రవరంలో విద్యుద్దీప కాంతులీనుతున్న మసీదు

సాక్షి, రాజమహేంద్రవరం: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం చివరి అంకానికి చేరుకుంది. రెండో పది రోజుల కాలం 'మగ్ఫిరత్ కా అష్ర' ముగిసింది. మూడో పది రోజుల కాలం ప్రారంభమైంది. మరో వారం రోజుల్లో ఉపవాస దీక్షలు ముగియనున్నాయి. మనిషి చేసిన పాపాలకు మరణానంతరం విధించే నరకాగ్ని నుంచి విముక్తి కోరుకునేందుకు ఈ చివరి అష్ర (పది రోజులు) కేటాయించారు.

ఇదీ ఉద్దేశం

ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12 నెలల్లో రంజాన్ మాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఇది 30 లేదా 29 రోజులు కూడా వస్తుంది. ఈ మాసాన్ని మూడు భాగాలుగా విభజించారు. మొదటి పది రోజులు రహమత్ కా అష్ర అంటారు. ఇందులో అల్లాహ్ కరుణ, దయ ఎక్కువగా ఉంటుంది. రెండో పది రోజుల కాలన్ని 'మగ్ఫిరత్ కా అష్ర' అంటారు. మూడో పది రోజుల కాలాన్ని 'జహన్నంసే పనాహ్ మాంగ్‌నే కా అష్ర' అంటారు. ఇందులో అనేక విశిష్టతలున్నాయి. ఇది రంజాన్ మాసం ముగింపు సందర్భంగా కనిపించే చంద్రదర్శనం వరకూ (21 రోజుల నుంచి 30 లేదా 29) ఉంటుంది. చేసిన పాపాలను కడిగేసుకునేందుకు తౌబా, అస్తగ్ఫర్‌ను పదేపదే పఠించాలి. నమాజులు చదివి, తెలిసీ తెలియక చేసిన తప్పులకు క్షమించాలని అల్లాహ్‌ను దువా ద్వారా వేడుకోవాలి. జీవితంలో మరోసారి అలాంటి తప్పులు చేయబోమని స్వచ్ఛమైన మనసుతో వేడుకుంటే (తౌబా) కరడుగట్టిన పాపాత్ములకు కూడా అల్లాహ్ విముక్తి కల్పిస్తారని పవిత్ర గ్రంథం ఖురాన్ బోధిస్తోంది. దీనిని అనుసరించి ముక్తి పొందాలని మౌల్వీలు, మత పెద్దలు ఉపదేశిస్తున్నారు.

లైలతుల్ ఖదర్ ప్రత్యేకం

రంజాన్ మాసం చివరి పది రోజుల్లో వచ్చే 'లైలతుల్ ఖదర్' (పెద్ద రాత్రి) ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆ రాత్రి జాగారణ చేసి, అల్లాహ్‌ను ఆరాధించి, నమాజులు చేసి, ఖురాన్ పఠించి, దువా చేసి, అనుగ్రహం పొందితే మరణం తరువాత స్వర్గం లభిస్తుందని ఖురాన్ బోధిస్తోంది. వెయ్యి నెలల పాటు నిత్యం అల్లాహ్‌ను ఆరాధిస్తే లభించే పుణ్యం కేవలం పెద్ద రాత్రి ఆరాధనలతో లభిస్తుందని మౌల్వీలు చెబుతారు. ఖురాన్ అవతరించింది ఈ అష్రలోనే. 'ఇఖ్రా బిస్మి రబ్బిక్' అనే పారా భూమి పైకి వచ్చిందని మౌల్వీలు చెబుతారు. రంజాన్ మాసంలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న పెద్ద రాత్రి ఏ రోజు ఉందో స్పష్టత లేదు. అయితే అది ఐదు తాఖ్‌రాత్‌ల పేరుతో ఉన్న గత నెల 31, ఈ నెల 2, 4, 6, 8వ తేదీ ఉపవాస దీక్షలు పాటించడం కంటే ముందు వచ్చే రాత్రుల్లో ఏదైనా ఒక దానిలో ఉంటుందని మహ్మద్ ప్రవక్త (సొల్లెల్లాహు అలైహి వసొల్లెం) బోధించిన హదీసు పుస్తకాల ద్వారా తెలుస్తోంది. ఈ ఐదు రాత్రులూ జాగారం చేస్తే లైలతుల్ ఖదర్ విశిష్టతలను పొందవచ్చు. ఇందులో భాగంగానే ముస్లింలు జిల్లా వ్యాప్తంగా జాగరణ ద్వారా అల్లాహ్‌ను ఆరాధిస్తున్నారు. ఉదయం వరకూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు.

భక్తిశ్రద్ధలతో తాఖ్‌రాత్‌లు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మసీదులున్నాయి. దాదాపు అన్నిచోట్లా తాఖ్‌రాత్‌లు నిర్వహిస్తున్నారు. మసీదులను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రంతా జాగారం చేసి, దైవారాధన చేపడుతున్నారు. జాగారం చేసిన వారికి మసీదుల్లో 'సెహరీకా ఇంతిజామ్' (భోజన ఏర్పాట్లు) చేపడుతున్నారు.

ఇతికాఫ్

ప్రపంచంతో పాటు సమాజ సుఖాలను త్యజించి, పూర్తిగా పది రోజుల పాటు అల్లాహ్ కోసం గడిపే కార్యక్రమాన్ని ఇతికాఫ్ అంటారు. మసీదులోనే ఒక మూలన ప్రత్యేక గదిలా గుడారం ఏర్పాటు చేసుకుని, అక్కడే ఉండాలి. ప్రార్థనలూ చేసుకోవాలి. బయటకు రాకుండా అవసరమైన వాటిని అక్కడే ఉంచుకుని దైవ సాన్నిధ్యంలోనే గడపాలి. రంజాన్ చివరి రోజుల్లో నిర్వహించే అష్రతో అల్లాహ్ సాన్నిధ్యం లభిస్తుంది.

నమాజ్, దువాలో గడపాలి



రంజాన్ చివరి పది రోజుల్లో నమాజ్, దువాలోనే సమయం గడపాలి. ఇతికాఫ్ అనే ప్రత్యేక ఇబాదత్ చేయాలి. తద్వారా అల్లాహ్ సాన్నిహిత్యం, చేసిన పాపాల నుంచి విముక్తి పొందవచ్చు. ఇఫ్తార్ వేళల్లో పూర్వీకుల పాపాలను క్షమించాల్సిందిగా దువా చేయాలి.

– మొహమ్మద్ ఆరిఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

పూర్వీకుల పాప విముక్తి

రంజాన్ రోజాల అనంతరం సాయంత్రం ఇఫ్తార్ వేళను మొర ఆలకించే సమయం అంటారు. ఆ సమయంలో కోరుకున్న వాటిని అల్లాహ్ ప్రసాదిస్తారని ఖురాన్ బోధిస్తోంది. ఇఫ్తార్‌కు ముందు చేసే దువాకు కూడా తప్పక ఆమోదం లభిస్తుంది. నరకం ఖరారైన పాపుల్లో (చనిపోయిన వ్యక్తులు) లక్షల మందికి ప్రతి ఇఫ్తార్ వేళలో అల్లా విముక్తి కలిప్స్తారని మత పెద్దలు చెబుతారు. మొదటి రోజా నుంచి చివరి రోజా వరకూ ఎంత మందికి విముక్తి కల్పిస్తారో.. అంత మందికి రంజాన్ చివరి రోజున ఇఫ్తార్ సమయంలో ఒకేసారి విముక్తి కల్పిస్తారని అంటారు. ఇఫ్తార్ వేళ చేసే దువాల్లో పూర్వీకులకు నరకం ఖరారై ఉంటే వారిని క్షమించి, విముక్తి కలిప్ంచి, స్వర్గంలో ప్రవేశం కల్పించాలని కోరుకుంటే అది ఫలిస్తుందని మౌల్వీలు ఉపదేశిస్తున్నారు.

చివరి రాత్రి

రంజాన్ చివరి రోజు రాత్రిని 'లైలతుల్ జాయిజా' (తెల్లవారితే ఈదుల్ ఫితర్ పండగ) అంటారు. ఈ రాత్రి చేసిన దువాలు తప్పక ఫలిస్తాయని హదీసులు బోధిస్తున్నాయి. సాధారణంగా పండగ చేసుకోవాలనే సంబరంతో ముస్లింలు షాపింగ్‌లు, సరదాలతో ఉంటారు. కానీ ఆ రోజు చేసే దువాలకు దైవదూతలు (ఫిరిస్తే) కూడా ఆమీన్ (తథాస్తు) అంటారని చెబుతారు.

నేటి నుంచి 6 వరకూ పెన్షన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని సుమారు 2.43 లక్షల మంది పెన్షన్‌దార్లకు సామాజిక భద్రత పెన్షన్లను బుధవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లతో తన చాంబర్ నుంచి మంగళవారం ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నవారు, మంచం పట్టిన వారు, వీల్ చైర్లకే పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు ఇంటి వద్దనే అందజేయాలని ఆదేశించారు. మిగిలిన వారికి గ్రామ/వార్డు సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పింఛన్ల పంపిణీ పూర్తయ్యేంత వరకూ సచివాలయాలు ప్రతి రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ లేదా ఆ రోజు నిర్దేశించిన పెన్షన్లు పూర్తిగా పంపిణీ చేసేంత వరకూ పని చేయాలని ఆదేశించారు. ఇందుకు తగిన సిబ్బందిని, సామగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పింఛనుదార్లకు తగిన నీడ, సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలను ఆయా పంచాయతీలు కల్పించాలని అన్నారు. పెన్షన్ పంపిణీ వివరాలను సచివాలయాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేయడానికి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు.. పింఛన్ల పంపిణీకి వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు సంక్షేమ అభివృద్ధి సెక్రటరీ, పంచాయతీ కార్యదర్శి, సంక్షేమ, విద్యా సహాయకులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీతోనే అందరి సంక్షేమం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, న్యాయవాది శ్రీనివాసులురెడ్డి

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పార్టీలో 1,500 మంది చేరిక

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీతోనే ప్రజలందరి సంక్షేమం సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. హుకుంపేట డి-బ్లాకులో న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యాన టీడీపీ, జనసేనకు చెందిన 1,500 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ మంత్రి వేణు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, తాను నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు సేవలందిస్తానని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని, చేయలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజల ఆశీర్వాదాలు ఓట్ల రూపంలో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకుని వచ్చి జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. పార్టీలో చేరిన వారందరూ సైనికుల్లా పని చేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు వినూత్న పథకాలతో కృషి చేశారని గుర్తు చేశారు. మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు మాట్లాడుతూ, గతంలో మాజీ మంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో డి-బ్లాకు అభివృద్ధి చెందిందన్నారు. మంత్రి వేణు రాకతో రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో చెల్లుబోయిన నరేన్, కేఆర్‌జే రాజేష్, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, డి-బ్లాకు పార్టీ నేతలు పాల్గొన్నారు.

జిల్లాలో 229 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

- కాపవరంలో జిల్లాలోనే తొలి కేంద్రం ప్రారంభం
- దళారీ వ్యవస్థకు ఆస్కారం లేదు
- నూరు శాతం మద్దతు ధర ఇస్తాం
- సేకరణ లక్ష్యం 3.20 లక్షల మెట్రిక్ టన్నులు
- జిల్లా కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: రబీ సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాపంగా 229 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కాపవరం రైతు భరోసా కేంద్రంలో జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ధాన్యం గింజకూ మద్దతు ధర అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు ముందుగానే అందించి సకాలంలో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వరి పంట ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయినందున అధికారులు ధాన్యం కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం ఆరుదలకు వారం రోజులు ముందుగానే కొనుగోళ్లకు షెడ్యూలు నిర్ణయించి, హమాలీలను ఏర్పాటు చేసి అవసరమైన వాహనాలకు జియోట్యాంగింగ్ చేయాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే నూరు శాతం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతుల్ని మిల్లర్లు ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా తేమ శాతాన్ని బట్టి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం విక్రయాల్లో రైతులకు ఎటువంటి సమస్య తలెత్తినా కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోలు రూములకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ రబీలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, తొలి విడతగా జిల్లాలో ఆరు మండలాల్లో 87 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 5న మరో ఆరు మండలాల్లో 55, ఈ నెల 9న మిగిలిన మండలాల్లో 87 కేంద్రాలు ప్రారంభిస్తామని వివరించారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 134 కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. వీటి ద్వారా 2,09,627 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, తహసీల్దార్ కె.మస్తాన్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక, వ్యవసాయ అధికారి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు పట్టాలు దాటుతూ వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని: స్థానిక రైల్వేస్టేషన్ కొండవారిపేట అండర్ పాసు వద్ద పట్టాలు దాటుతున్న (30) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మంగళవారం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఒకటో నంబరు ఫ్లాట్‌ఫాం నుంచి రెండో నంబరు ఫ్లాట్‌ఫాంపైకి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా అన్నవరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పసుపు, తెలుపు, నలుపు, నీలం రంగు టీషర్ట్, మిలటరీ గ్రీన్ జీన్స్ ఫ్యాంటు దుస్తులు ధరించి ఉన్నాడు. మృతుడి కుడి చేతిపై ఓం అనే హిందీ సింబల్, పప్పు, రేఖ ఇంగ్లిషు అక్షరాల పచ్చబొట్టు కలిగి ఉన్నాడు. కుడి భుజం వెనుక సింహం తల పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

మోటార్ సైకిల్‌కు నిప్పు పెట్టిన దుండగులు

కరప: మండల కేంద్రం కరపలో సోమవారం అర్ధరాత్రి దుండగులు బుల్లెట్ మోటార్ సైకిల్‌కి నిప్పు పెట్టి పరారయ్యారు. ఈ విషయమై బాధితుడు సానా వీరబాబు కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబాబు కరపలో బిర్యానీ పాయింట్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకొని హైస్కూల్ ఎదురుగా తాను ఉంటున్న ఇంటి సందులో బుల్లెట్ మోటార్ సైకిల్ పెట్టి లోపలికి వెళ్లిపోయాడు. మంగవారం ఉదయం లేచి చూసేసరికి బుల్లెట్ బండి కాలిపోయి ఉంది. వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కరప పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పక్కనే ఉన్న పుల్లల దుకాణంలోకి వెళ్లి సందులో ఉన్న బుల్లెట్ బండిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టినట్లు గుర్తించారు. వీరబాబు తనకు ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉందని, వారే కక్షతో ఈ పనికి పూనుకొని ఉంటారన్నారు. గత ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి ఇంటి సందులో పెట్టిన బుల్లెట్ బండిని అపహరించుకుపోయారని, దీనిపై అప్పట్లో కరప పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. రెండు వారాల క్రితం రూ. 1.40 లక్షలతో మరో బుల్లెట్ బండిని కొనుగోలు చేయగా దుండగులు పెట్రోలు పోసి తగులబెట్టారని బాధితుడు వీరబాబు వివరించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ సూరిబాబు వివరించారు.

ఓటరును ప్రలోభ పెడితే శిక్షలు

- అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే
- తప్పుల తీరును బట్టి చట్ట పరిధిలో కేసులు



కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడుతుంటాయి. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం తీవ్రమైన నేరం. తప్పుల తీరును బట్టి ఆయా చట్టాల కింద కేసులు నమోదవుతాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 భారత శిక్షాస్మృతి చట్టాల కింద నమోదయ్యే కేసుల్లో నేరం రుజువైతే జరిమానా లేదా జరిమానాతో పాటు శిక్షకు గురవుతారు.

ఓటర్లను బెదిరిస్తే..
ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంటుంది. ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. ఓటర్లను ఒత్తిడికి గురి చేయడం, బెదిరించటం తీవ్రమైన నేరం. ఇలా చేసినట్లు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171 (సీ) చట్టం కింద కేసు నమోదవుతుంది.

కానుకలు పంపిణీ చేస్తే..
ఓటర్లకు మద్యం, కానుకలు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేయకూడదు. అన్నదానాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఐపీసీ 171(ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.

ఖర్చుల వివరాలు చూపకుంటే..
ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలు ఎన్నికలు ముగిసిన నెలలోగా అందించాలి. లేకుంటే ఐపీసీ 171 (ఐ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

విద్వేష పూరిత ప్రసంగాలు
ఓట్ల కోసం కులం, మతం, ఓ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరచటం వంటివి చేయకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదవుతుంది.

లేనిది ఉన్నట్లు చెప్పినా..
ప్రచారం చేసే అభ్యర్థులు ప్రజలను ఆకర్షించేందుకు ఒక్కోసారి అబద్ధాలు చెబుతుంటారు. లేనిది ఉన్నట్లు ప్రచారం చేస్తుంటారు. దీనిపై ప్రత్యర్థులు ఫిర్యాదు చేస్తే ఐపీసీ 171 (జి) కింద కేసు నమోదవుతుంది.

ప్రచార సమయం మించితే..
అభ్యర్థులకు కేటాయించిన సమయాన్ని మాత్రమే వినియోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మైకులు వాడటం, ప్రచార సామగ్రి వినియోగించడం నేరం. దీనికిగాను ఐపీసీ 171 (ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు.

మద్యం పంపిణీ చేస్తే
ఎన్నికలంటే మొదటి గుర్తుకొచ్చేది మద్యం, ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు మద్యం ఎక్కువగా పంపిణీ చేస్తుంటారు. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి తీసుకెళ్లడం నేరం. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లకు మద్యం పంపిణీ చేసేందుకు భారీ మోతాదులో రవాణా చేస్తూ పట్టుబడితే అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 24 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికిగాను ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధిస్తారు.

డబ్బు పంపిణీ చేస్తే..
అభ్యర్థులు అక్రమ చెల్లింపులు చేయడం నేరం. ఇలా చేస్తే ఐపీసీ 171 (హెచ్) కింద చర్యలు ఉంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులిచ్చినా, ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ 171 (బి) సెక్షన్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ఓటరు కార్డుకు 31 ఏళ్లు

అంబాజీపేట: భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25 ఏర్పాటైంది. అప్పటి నుంచి 1993 వరకు ఓటరు గుర్తింపు కార్డులు లేవు. ఎన్నికల ప్రక్రియలో దొంగ ఓట్లను నివారించి, పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీ.ఎన్. శేషన్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఓటరు గుర్తింపు కార్డును ప్రవేశపెట్టారు. అప్పట్లో ఆ నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఓటరు గుర్తింపు కార్డు అమలులోకి వచ్చి నేటికి 31 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో బ్లాక్ అండ్ వైట్లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను ప్రస్తుతం డిజిటల్ విధానంలో ముద్రించి ఓటరుకు అందిస్తున్నారు. ఓటరు జాబితాలోని క్రమసంఖ్య ప్రకారం ఓటరు ఫొటోతో, చిరునామా, వయసు సహా పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తున్నారు.

సెబ్ ఆధ్వర్యంలో విస్తృత దాడులు

- సెబ్ కోరుకొండ సీఐ బంగారురాజు
- 25 మంది నిందితులపై కేసులు
- 300 లీటర్ల మద్యం, 1,500 లీటర్ల సారా స్వాధీనం


గాడాలలో 150 లీటర్ల సారాతో పట్టుబడ్డ నిందితుడు

మధురపూడి: ఎన్నికల నేపథ్యంలో కోరుకొండ సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించి 1,500 లీటర్ల సారాను సీజ్ చేసినట్టు సీఐ బంగారురాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల తో మాట్లాడారు.10,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. సర్కిల్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో ఈ దాడులు చేశామన్నారు. బెల్టుషాపులపై నిర్వహించిన దాడుల ద్వారా 300 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో నిందితులు 25 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. దాడుల్లో గోదావరి లంకలను జల్లెడ పట్టినట్టు, సారా, మద్యం విక్రయాలను నిషేధించాలన్న లక్ష్యంతో దాడులు విస్తృత పర్చినట్టు వెల్లడించారు. నిందితులు రఘునాథపురానికి చెందిన కొత్తపల్లి ఆశీర్వాదం, గాడాలకు చెందిన వాకా సత్యనారాయణ, బుచ్చెంపేటకు చెందిన కోసూరి శ్రీను, నర్సాపురానికి చెందిన బొంతా సుబ్బారావు, బొల్లెద్దుపాలెం గ్రామానికి చెందిన కోడే పెంటయ్యపై కేసులు నమోదు చేశామన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

5 నుంచి అధ్యయనోత్సవాలు


తిరుమంజన సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు వారం రోజులపాటు నిర్వహించే కల్యాణోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రభుత్వ నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో ఆలయాన్ని సరికొత్త హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు స్వామివారిని త్వరగా దర్శించుకునేందుకు క్యూలను విస్తరించే పనులు వేగంగా చేస్తున్నారు. ఆలయంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు అడుగడుగునా ప్యూరిఫైడ్ తాగునీరు అందించే చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికలు, పోస్టర్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి అధ్యయనోత్సవాలు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు తిరుమంజన సేవ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబంపై టీడీపీ వర్గం దాడి

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మ సమేధ్యం పంచాయతీ బలుసుతిప్పలో టీడీపీ వర్గానికి చెందిన కొందరు వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబంపై దాడి చేశారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీకి చెందిన మహిళ తీవ్ర గాయాల పాలయ్యింది. స్థానికుల సమాచారం ప్రకారం వైఎస్సార్ సీపీకి చెందిన సంగాని వీరబాబు పార్టీ జెండాతో ఇటీవల గ్రామంలో తిరగడంపై కక్ష కట్టిన టీడీపీ వర్గం దాడికి పాల్పడింది. సోమవారం రాత్రి సంగాని వీరబాబు, అతని తల్లిదండ్రులు సత్యవతి, గంగాద్రిపై టీడీపీ వర్గానికి చెందిన దండుప్రోలు దుర్గారావు, దండ్రుప్రోలు అనపర్తి, దండుప్రోలు రాణివాసు, దండుప్రోలు వీరబాబు మూకుమ్మడిగా దాడి చేశారు. సంగాని సత్యవతిపై రాడ్డుతో తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైంది. టీడీపీ నాయకులు ప్రోద్బలంతోనే దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ముమ్మిడివరం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కాట్రేనికోన ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. గాయపడిన మహిళను ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో శశికళకు సిల్వర్ మెడల్


శశికళను అభినందిస్తున్న డీఈవో కుమలకుమారి తదితరులు

అమలాపురం రూరల్: ఇటీవల విజయవాడలో జరిగిన అండర్- 17 రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఉందుర్తి శశికళ ద్వితీయ స్థానాన్ని సాధించి సిల్వర్ మెడల్ గెల్చుకుంది. ఈ సందర్భంగా మంగళవారం శశికళ డీఈఓ కమలకుమారి, ఉప విద్యాశాఖ అధికారి లక్ష్మీనరసింహంను కలిశారు. పాఠశాల హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, పీఈటీ నరసింహారావు, శివాలిని, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణార్జున, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు అభినందించారు. శశికళ దేశం తరపున ఆడాలని వారు ఆకాంక్షించారు.

నవోదయ ఆరవ తరగతి ఫలితాల విడుదల

పెద్దాపురం: జవహార్ నవోదయ విద్యాలయ (పెద్దాపురం)లో ఆరవ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ జనవరి 20వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు 8,506 మంది విద్యార్థులు హాజరు కాగా ఖాళీగా ఉన్న 80 సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఎస్1066364, సీ1070018, ఓ1069996, ఐ1070176, ఎస్1072874, జే1066413, జే1068749, కే1069990, ఐ1066406, జే1071002, కే1070139 కే1070787, ఎస్1073215, జే1067003, జే1069699, కే1070180, ఎస్1067491, ఎస్1069929, ఐ1069780, జే1070942, ఎస్1073273, జే1067300, జే1069892, కే1070841, ఎం1078034, బి1071355, ఎల్1067288, ఐ1071014, జే1073939, జే1067511, జే1070267, కే1071719, ఎఫ్1068967, ఎస్1072138, ఎస్1066420, ఎం 1071224, ఎస్1074130, జే1067597, జే1071311, ఓ1074521, ఐ1069295, జే1072238, ఐ1066991, జే1071770, ఎస్1074303, జే1067622, ఓ1067053 ఎల్1066769, బి1069736, జే1074248, జే1067772, కే1071837, ఐ1074453, జే1067913, కే1068045, పి1067196, ఎ1069955, సీ1068101, ఎస్1067779, ఓ1072216, ఎస్1074466, ఎస్1068297, కే1068233, పీ1067451, ఐ1068461, జే1068590, ఐ1069237, జే1072454, ఎస్1074583, జే1068391, ఓ1068834, ఎల్1068763, సే1068546, ఐ1068842, ఐ1069694, ఎస్1072657, ఎస్1066343, జే1068518, ఓ1069135, పీ1072372, హాల్ టిక్కెట్ నంబర్లు గల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు విద్యాలయలో ప్రవేశానికై అడ్మిషన్ ఫారాలు నవోదయ విద్యాలయకు వచ్చి తీసుకోవాలని ప్రిన్సిపాల్ కమలం కోరారు.

బలభద్రపురంలో అగ్ని ప్రమాదం

- 2 తాటాకిళ్లు దగ్ధం
- రూ. 4 లక్షల ఆస్తినష్టం


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకిళ్లు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు శివారు బలభద్రపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. ఈ ప్రమాదంలో రూ.4లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు జగ్గంపేట అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపారు. బలభద్రపురంలో సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో షార్టు సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకోగా స్థానికుల సహకారంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ ప్రమాదంలో గోపిశెట్టి దేవి, గోపిశెట్టి పార్వతికి చెందిన తాటాకిళ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయని అన్నారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలో మార్చి ఒకటో తేదీన ఇంటి బయట పార్కింగ్ చేసిన తన మోటారు సైకిల్ అపహరణకు గురైనట్లు అనుమలపూడి అచ్యుతరామారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. పలుచోట్ల వెతికినప్పటికీ దొరక్కపోవడంతో బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని మూలస్థాన అగ్రహారం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వైపు ఇటుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను అదే మార్గంలో వెళుతున్న టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ట్రాక్టర్‌పై కూర్చున్న గ్రామానికి చెందిన ఎం.రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ప్రమాదానికి గురైన వాహనాలను భారీ క్రేన్ సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తీవ్ర గాయాల పాలైన రామకృష్ణకు హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్సను అందించారు. మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల బలోపేతం

జిల్లా పోలీసు సమీక్షా సమావేశంలో ఐజీ అశోక్‌కుమార్


బందోబస్తుపై సమీక్షిస్తున్న ఐజీ అశోక్‌కుమార్. చిత్రంలో ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

అమలాపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా పోలీసు శాఖ సమర్థంగా పనిచేసే దిశగా ఇప్పటికే జిల్లాలో ఏర్పాటైన ఆరు జిల్లా సరిహద్దు, ఒక అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో నిరంతర నిఘాను మరింత బలోపేతం చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎన్నికల బందోబస్తు, జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలపై జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడారు. ఎస్పీ సుసురాపు శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించే అంశాలపై ఐజీ అశోక్‌కుమార్ అంశాల వారీగా సమీక్షించారు. ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్పీలు సమీక్షలో పాల్గొని ఎన్నికల బందోబస్తు వ్యూహంపై చర్చించారు. ఐడీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ ముగిసే వరకూ చేపట్టాల్సిన రోజు వారీ చెక్ లిస్ట్ తయారు చేసుకుని బందోబస్తు నిర్వహించాలని సూచించారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల నిరంతర తనిఖీలతో అక్రమ రవాణాను ముఖ్యంగా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులను తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో వివాదాలు, గొడవల్లో పాల్గొన్న ముద్దాయిలు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేయాలని ఆదేశించారు. అన్ని లైసెన్స్ తుపాకులను ఎన్నికల దృష్ట్యా డిపాజిట్ చేయించాలని ఐజీ స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా జిల్లాలో ట్రోలింగ్స్, తప్పుడు సమాచారం, వార్తల వ్యాప్తికి పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశానంతరం జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాల (సీఐఎస్ఎఫ్)తో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా స్థలంలో ఐజీ అశోక్‌కుమార్ కొద్దిసేపు చర్చించారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.మహేశ్వరరావు, బి.రామకృష్ణ, కేవీ రమణ, జిల్లా దిశ డీఎస్పీ వై.గోవిందరావు, ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, స్పెషల్ బ్రాంచి సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ ఎం.అప్పలనాయుడు, స్పెషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు ఐజీ నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు.

భార్యను బెదిరించినందుకు మూడేళ్ల జైలు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను చంపుతానని బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తీర్పు చెప్పినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ మంగళవారం తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన అడుసుమిల్లి శష్య శ్రావణికి విశాఖపట్నంకు చెందిన వెంకటేశ్వరరావుతో 2010 ఏడాదిలో వివాహమైంది. కట్నం కోసం భర్త వేధించడంతో పాటు చంపుతానని బెదిరించడంతో బాధితురాలు శష్య శ్రావణి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో వెంకటేశ్వరరావుకు జైలుశిక్షతో పాటు నగదు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కేసులో ఏపీపీ గంగాధర్, కోర్టు కానిస్టేబుల్ కె.సోమరాజు సహకరించారన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని విద్యార్థి మృతి

కరప: కాకినాడ–రామచంద్రపురం ప్రధాన రహదారిలో కరప మండలం పెదకొత్తూరు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్ ఢీకొని పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. కరప ఎస్ఐ టి రామకృష్ణ సమాచారం మేరకు రామచంద్రపురం మండలం ఓడూరు గ్రామానికి చెందిన బుంగా తనీష్ (15) కరప మండలం వేములవాడలో ఉంటున్న స్నేహితుని ఇంటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. పెదకొత్తూరు జానకిరామ్ రైస్ మిల్లు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనీష్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బుంగా రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

11న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. దీనిలో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్ ఉదయం 10 గంటల నుంచి ఆయా కోర్టులలో ప్రారంభమవుతుందన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఐదుగురికి జైలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వరకట్నం వేధింపుల కేసులో ఐదుగురు వ్యక్తులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రవీణ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించిన వివరాల్లోకెళితే... శ్రీకాకుళంకు చెందిన శ్రీదంతా లక్ష్మీలావణ్యకు, రాజమహేంద్రవరం రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న గుజ్జుల రవికి 2019 ఫిబ్రవరి 10న వివాహమైంది. భర్త గుజ్జుల రవితో పాటు అతని కుటుంబ సభ్యులు లావణ్యను కట్నం తీసుకురావాలంటూ వేధించసాగారు. ఆమెను పుట్టింటికి పంపకుండా వేధింపులకు గురిచేసేవారు. లావణ్య చెల్లి పెళ్లికి ఆమెను ఇంటికి పంపలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో 2021 సెప్టెంబర్ 11న ఆమె ఉంటున్న ఇంటిలో కిటీకీకి చున్నీ బిగించి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై లావణ్య తండ్రి శ్రీదంతా నర్సింహమూర్తి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ ఎ.వెంకటేశ్వరావు కేసు నమోదు చేశారు. నిజ నిర్ధారణ కావడంతో లావణ్య భర్త గుజ్జల రవికి ఏడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, అతని తండ్రి గుజ్జల రాములు, తల్లి గుజ్జల రమణమ్మ, బొమ్మిడి సుందరమ్మ, తుంగాన జయలక్ష్మిలకు మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో కృషి చేసిన డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్. సీఐ వి.శ్రీనివాసరావు, ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించిన ఎంఏ.బాషా, కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శ్రీనివాస్‌రావును జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
బుధవారం ॥ 3-4-2024

'నా దేహం నా ఇష్టం. నాకు ఇష్టమైనవి తింటాను'... అనుకోవడంలో ఇతరులకు ఎటువంటి అభ్యంతరమూ ఉండాల్సిన అవసరం లేదు. కానీ సమాజంలో గౌరవంగా జీవించాలంటే మనం తినే ఆహారం ఆరోగ్యకరంగా ఉండాలి. వినడానికి విచిత్రంగా ఉన్నా సరే ఇది నిజం. ప్రతి ఒక్కరూ 'పోషకాహారం తీసుకోవాలి, దేహానికి అవసరమైనంత మాత్రమే తీసుకోవాలి. దానికి తగినట్లు వ్యాయామం చేయాలి'... దైనందిన జీవితం ఇలా క్రమబద్ధంగా ఉన్న వ్యక్తి ఆలోచనలు ఆరోగ్యకరంగా ఉంటాయి. ప్రవర్తన కూడా గౌరవపూర్వకంగా ఉంటుంది. స్థూలంగా చెప్పినా సూక్ష్మంగా చెప్పినా, విషయం ఏమిటంటే... ఆరోగ్యకరమైన దేహం ఆరోగ్యకరంగా ఆలోచిస్తుంది. మానసిక ఆరోగ్యంలో అపసవ్యతలు తలెత్తాయంటే అవి కేవలం మానసికం మాత్రమే కాదు, అసలైన సమస్య దేహంలోనే ఉంటుంది. దేహానికి అందుతున్న ఆహారంలోనే ఉంటుంది... అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితా గుప్తా.



ప్రతీకాత్మక చిత్రం

ఆకలికి అలవాటుకి తేడా ఉంది

ఇదో మైండ్‌గేమ్!

''సమాజంలో మంచి వ్యక్తిగా చలామణి కావాలంటే మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసిక ఆరోగ్యం మీద మన అలవాట్లు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. మనకు తెలియకుండా చేసే పొరపాటు ఏమిటంటే 'ఆకలి- అలవాటు' మధ్య తేడా గుర్తించకపోవడం. ఆకలి లేకపోయినా అలవాటుగా తినడం, ఒత్తిడిలో ఉన్నప్పుడు దాన్నుంచి తప్పించుకోవడానికి ఆహారాన్ని ఆశ్రయించడం అనే దురలవాటు ఎప్పటి నుంచో ఉంది, కానీ ఇటీవల ఎక్కువైంది. దైనందిన జీవితంలో ఒత్తిడి ఎక్కువైంది, జిహ్వను సంతృప్తి పరుచుకోవడానికి జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లడం అనేది కూడా మన జీవనశైలిలో భాగమైపోయింది. నిజానికి మన మెదడు మనతో గేమ్ ఆడుతుంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిసినప్పటికీ మనసు జంక్‌ఫుడ్ మీదకు మళ్లిస్తుంది. ఇదెలాగంటే... రేపటి నుంచి వ్యాయామం మొదలు పెట్టాలని నిర్ణయం తీసుకుని అలారం పెట్టుకుంటాం. అలారం మోగినప్పుడు ఆపేసి మళ్లీ నిద్రపోతాం. మన జీవనశైలికి అనుగుణంగా మన మెదడులో మ్యాపింగ్ జరిగిపోయి ఉంటుంది. దాని నుంచి బయటపడడానికి మెదడు ఇష్టపడదు. ఆ కంఫర్ట్ జోన్ నుంచి మనల్ని కూడా బయటకు రానివ్వదు. అలాంటప్పుడు మనం మెదడు మాటను పెడచెవిన పెట్టడమే పరిష్కారం. మనల్ని మనం దురలవాట్ల నుంచి బయటేసుకోవాలంటే ఆ ప్రయత్నంలో మనల్ని వెనక్కి లాగే మెదడు చెప్పే మాటను వినకూడదు.

ఆహారం-
మానసిక అనారోగ్యం!

మనం అలవాటుగా నిత్యం జంక్‌ఫుడ్‌తో పొట్టను నింపేస్తుంటే దేహం శక్తిహీనమవుతూ ఉంటుంది. అలసటతోపాటు ప్రతిదానికీ చిరాకు, ఆందోళన, ఆవేశపడడం వంటి లక్షణాలు తోడవుతాయి. మెదడు నుంచి నాడీ వ్యవస్థ ద్వారా దేహభాగాలకు



అందాల్సిన సంకేతాల్లో అపసవ్యతలు తలెత్తుతాయి. ఒక విషయానికి సక్రమంగా ప్రతిస్పందించాల్సిన సందర్భంలో విపరీతంగా స్పందించడం వంటి మార్పులు కనిపిస్తాయి. మానవ సంబంధాలు దెబ్బతింటాయి. మానసిక సమస్యలు తీవ్రరూపం దాల్చినప్పుడు మాత్రమే మానసిక వైద్యుని సంప్రదిస్తుంటాం. ప్రతి ఒక్కరిలో సమస్య అంతటి స్థాయి తీవ్రతకు దారితీయదు. కానీ మధ్యస్థ దశ ఎక్కువ మందిలో కనిపిస్తుంటుంది. ఈ సమస్యకు వైద్యం... మనం మంచి ఆహారం తీసుకోవడమే. బ్రెయిన్ మనతో ఆడుకుంటుంది, మనం బ్రెయిన్‌ని మన అధీనంలో ఉంచుకోగలగాలి. అదే దేహానికి-మెదడుకు సమగ్రమైన ఆరోగ్యం. మనం ఏమి తింటున్నామో దానిని బట్టి మనం ఏమిటో చెప్పవచ్చు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువెళ్లగలిగితే సమాజం ఎదుర్కొంటున్న అనేక మానసిక రుగ్మతలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన బంధాలతో అందమైన సమాజాన్ని నిర్మించడానికి నా వంతుగా చేస్తున్న ప్రయత్నమే ఇది'' అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితాగుప్తా.

– వాకా మంజులారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

వార్ధక్యం పొంచి ఉంటుంది

బాడీ-మైండ్‌ని కలిపి ఒక యూనిట్‌గా పరిగణించాలి. ఒకటి ప్రమాదంలో పడితే రెండవది కూడా ప్రమాదంలో పడుతుంది. దేహం సమతుల ఆరోగ్యంతో ఉన్నప్పుడే మెదడు కూడా సంపూర్ణారోగ్యంతో ఉంటుంది. దేహానికి సంతులిత ఆహారం అందనప్పుడు తలెత్తే సమస్యలు మానసిక అపసవ్యతలు మాత్రమే కాదు వార్ధక్యం కూడా. త్వరగా వయసు మీద పడుతున్న వారిలో దేహానికి పోషకాహారం తగిన మోతాదులో అందకపోవడంతోపాటు చిన్న చిన్న మానసిక రుగ్మతలతో సతమతమైన నేపథ్యం కనిపించి తీరుతుంది. ఇది అంతర్జాతీయంగా నిర్వహించిన అధ్యయనం. జంక్‌ఫుడ్ కారణంగా ఎదురయ్యే సమస్య స్థూలకాయం మాత్రమే కాదు మానసిక అనారోగ్యాలు కూడా. దేహం లోపల ఇన్‌ఫ్లమేటరీ కండిషన్‌కు దారి తీస్తుంది. అది దేహం వార్ధక్యం బారిన పడడానికి తొలి దశ.

– సుస్మితా గుప్తా,
హెల్త్ సైకాలజిస్ట్, ద క్యూర్ స్పేస్

అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం...
ఇలా మన సంస్కృతిలో దానగుణానికి విశేష గౌరవం ఉంది.
అయితే భువనేశ్వర్‌కు చెందిన హరిప్రియ నాయక్ ప్రచారం చేసేది మాత్రం 'శిరోజాల దానం'. 'మీరు దానం చేసే శిరోజాల పేద కేన్సర్ పేషెంట్ల ముఖంలో చిరునవ్వు తీసుకొస్తుంది' అంటుందామె. సేకరించిన జుట్టుతో విగ్గులు తయారు చేయించి పంచుతున్న హరిప్రియ నాయక్ అనేక ప్రశంసలు పొందుతోంది.

సేవ

శిరోజాలు దానం చేయండి



శిరోజాల దాతలతో ప్రియానాయక్

కేన్సర్‌తో పోరాడి గెలవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. చాలా మంది గెలుస్తారు. అయితే దిగువ మధ్యతరగతి స్త్రీలు, పేద స్త్రీలు ఈ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. కేన్సర్ చికిత్స సమయంలో కిమోథెరపీ వల్ల జుట్టు రాలిపోతుంది. ఆ సమయంలో శిరోముండనం కూడా చేయించుకోవాల్సి వస్తుంది. స్తోమత కలిగిన వర్గాల స్త్రీలు తిరిగి పూర్తి జుట్టు వచ్చేవరకూ విగ్గులు ధరిస్తారు. కాని పేద వర్గాల స్త్రీలకు ఆ అవకాశం ఉండదు. వారి కోసం, వారి ఆత్మవిశ్వాసం కోసం ఉచితంగా విగ్గులు ఏర్పాటు చేస్తోంది హరిప్రియ నాయక్. 'శిరోజాల దానం ఇవ్వాల్సి అవసరం' అంటుందామె.

సామాజిక సేవ

ఒడిశ్సాలోని ఖుర్దా జిల్లాకు చెందిన 32 ఏళ్ల హరిప్రియ నాయక్ సామాజిక సేవారంగంలో పని చేస్తోంది. 'ఒకసారి నేను కీమోథెరపీ వల్ల జుట్టు కోల్పోయిన పేదస్త్రీలను చూశాను. వారు ఇంటినుంచి బయటకు రావడానికే సిగ్గుపడుతున్నారు. కేన్సర్‌తో పోరాడే సమయంలో మానసికంగా, శారీరకంగా గట్టిగా ఉండాలి. మానసికంగా కుచించుకుపోతే కష్టం. స్త్రీలు జుట్టును ఇష్టపడతారు. వారికి సరైన విగ్గు ఇవ్వగలిగితే ఆత్మవిశ్వాసం వస్తుందని పనిలోకి దిగాను' అంటుంది హరిప్రియ నాయక్. ఆమె 2021లో 'మిషన్ స్మైల్ ఫర్ ది కేన్సర్ ఫైటర్స్' పేరుతో ఒక కార్యక్రమాన్ని శిరోజాల సేకరణ కోసం మొదలుపెట్టింది. శిరోజాల దానం కోసం ప్రచారం కొనసాగించింది.



ప్రియానాయక్

9 మంది సాయం ఒకరికి మేలు

'సింథటిక్ విగ్గులు త్వరగా పాడవుతాయి. వాటివల్ల చర్మ సంబంధ ఇబ్బందులు వస్తాయి. అదే సహజమైన జుట్టుతో చేసిన విగ్గులు మన్నికగా ఉంటాయి. ఇందు కోసం ఎవరైనా సరే శిరోజాలు ఇవ్వొచ్చు. కాని 12 అంగుళాల కంటే ఎక్కువ పొడవు ఉన్నప్పుడే అవి ఉపయోగపడతాయి. 9 మంది ఇచ్చిన జుట్టుతో ఒక్క విగ్గ తయారవుతుంది. మా ప్రచారం ఒడిస్సాలో మాత్రమే కాదు జార్ఖండ్‌లో కూడా కొనసాగుతోంది. ఒక ఆరేళ్ల పాప మాకు శిరోజాలు ఇవ్వడం ఒక రికార్డు' అంటుంది హరిప్రియ నాయక్.

హెయిర్ డొనేషన్ ఒడిశా

'హెయిర్ డొనేషన్ ఒడిశా' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుంది హరిప్రియ నాయక్. వాలెంటీర్లు పని చేసే వారిని ఆహ్వానిస్తుంది. ఇప్పటికి 150 మంది వాలెంటీర్లు ఆమెతోపాటు పని చేస్తున్నారు. శిరోజాలు దానం చేసే వారి నుంచి వాటిని సేకరించి హైదరాబాదులోని 'హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ కేన్సర్ పేషెంట్స్' సంస్థకు పంపుతారు. అది ఉచితంగా విగ్గులు తయారు చేసి ఇస్తుంది. వాటిని కేన్సర్ ఫైటర్స్‌కు అందజేస్తారు.

'నా జుట్టు తగినంత పెరిగిన ప్రతిసారీ నేను దానం చేస్తుంటాను. మీరు కూడా చేయండి. ఇది కూడా పుణ్యకార్యమే' అంటుంది హరిప్రియ నాయక్.

మీరు ఆర్థిక అక్షరాస్యులేనా?!

'భారతీయ స్త్రీలు ఆర్థికంగా అక్షరాస్యులు కాకపోవడానికి ప్రధాన కారణం పితృస్వామ్యమే' అంటోంది గ్లోబల్ సర్వే స్టాండర్డ్ అండ్ పూర్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఆర్థిక భద్రత, ఆర్థిక అక్షరాస్యత స్త్రీకి ఎంత అవసరమో తెలుసుకుంటే ఆమె పురోభివృద్ధిలో మరిన్ని మంచిమార్పులు చోటుచేసుకుంటాయన్నది అక్షర సత్యం.

సంపాదనలో నేటితరం మహిళలూ తమ సత్తాను చూపుతున్నారు. వృత్తి, ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అక్షరాస్యతలోనూ ముందడుగు వేస్తున్నారు. అయితే, ఆర్థిక అక్షరాస్యతలో మాత్రం మహిళ వెనకంజలోనే ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ బారోమీటర్ సర్వే స్పష్టం చేస్తోంది. 28 దేశాలలో నిర్వహించిన ఈ సర్వేలో (స్త్రీ-పురుషులు ఇద్దరినీ కలిపి) భారతదేశం 23వ స్థానంలో ఉంది. కేవలం 35 శాతం మంది మాత్రమే ఆర్థిక అక్షరాస్యులుగా ఉంటే, 65 శాతం మందికి ఆర్థిక అవగాహన తక్కువ. ఇందులోనూ మహిళలు మరింతగా వెనకబడి ఉన్నారు అని తెలియజేసింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ వందకోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు సొంత బ్యాంకు ఖాతా కూడా లేనివారున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

భావోద్వేగాలతో ఆట

తరచూ భర్తలు తమ భార్యలతో 'నేను సంపాదిస్తున్నాను కాబట్టి నువ్వు సంపాదించాల్సిన అవసరం ఏముంది? ఇంటిని, పిల్లలను నిర్లక్ష్యం చేసినట్టే అవుతుంది' అనే ఎమోషనల్ స్ట్రాటజీలతో మహిళలు ఇరుక్కుంటున్నారు. దీంతో మహిళలు క్రమంగా ఒంటరిగా, నిస్సహాయంగా మారుతుంటారు. దురదృష్టం ఏమిటంటే 'ప్రేమ' అనే పేరుతో జరిగే ఆర్థిక దుర్వినియోగాన్ని మహిళలు గుర్తించలేకపోతున్నారు. ఆర్థిక భద్రత లేకపోవడంతో స్త్రీలు తమకి నచ్చని సంబంధాలలోనూ సర్దుబాటు చేసుకుంటూ జీవించాల్సి వస్తుంది. చెడు సంబంధాలలోకి వెళుతుంటారు. డబ్బును పొదుపు చేసి పెట్టుబడులు పెట్టడానికి బదులు, ఆమె కుటుంబం కోసం తనను తాను త్యాగం చేసుకుంటుంది. చివరకు అదే కుటుంబంలోని వ్యక్తులు లేదా పిల్లలు స్త్రీల మీద ఆర్థిక ఒత్తిడిని తీసుకువస్తున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గృహహింసను తగ్గించవచ్చని 'రైట్స్ ఆఫ్ ఈక్వాలిటీ' అనే సంస్థ 'ది ఎకనామిక్ అబ్యూజ్ అండ్ ది ఇంపార్టెన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ లిటరీ ఆఫ్ ఉమెన్' నివేదికలో పేర్కొంది.

నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి

కుటుంబం ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో సాధారణంగా మహిళలు ఉండరు. లక్ష్మి ఒక సాధారణ గృహిణి. ఇప్పటికీ బ్యాంకు ఖాతా తెరవడానికి, కేవైసీ చేయడానికి భర్తతో కలిసే బ్యాంకుకు వెళుతుంది. ఆర్థికవిషయాలు అంటే ఆమెకు ఒక విధమైన భయం. సొంతంగా ఎప్పుడూ ప్రయత్నం కూడా చేయదు. ఇలాంటి గృహలక్ష్ములు మన దేశంలో ఎంతోమంది ఉన్నారు. ఉమ ఉద్యోగం చేస్తుంది. కానీ, ఆమె ఏటీఎం కార్డ్ భర్త వద్ద ఉంటుంది. పాస్‌వర్డ్ లాంటివి ఆమె స్వయంగా రూపొందించదు. అవన్నీ ఆమె భర్త చేస్తాడు. ఉద్యోగం చేస్తున్నా కూడా ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక స్వేచ్ఛ లేని ఇలాంటి మహిళలు కోట్లాదిమంది ఉన్నారు.

షాపింగ్‌లో సమస్య లేదు

'ఆర్థిక అక్షరాస్యత అంటే బ్యాంకుకు వెళ్లడం, అకౌంట్ ఓపెన్ చేయడం, చిన్న చిన్న లావాదేవీలు చేయడం అనుకోవాలా?!' అనే ప్రశ్న ఉదయించకమానదు. అయితే, 'ఇండియన్ ఉమెన్ అండ్ ఫైనాన్షియల్ ఫిట్‌నెస్' రచయిత సునీల్ గాంధీ మాట్లాడుతూ 'చాలా మంది మహిళలకు మొబైల్ యాప్‌లో షాపింగ్ చేయడం, క్యాబ్ బుక్ చేసుకోవడంలో ఎటువంటి సమస్య ఉండటం లేదు. అయితే, తమ సొంత బ్యాంకు ఖాతాను నిర్వహించడంలో లేదా ఆన్‌లైన్ లావాదేవీలు, పెట్టుబడుల పట్ల మాత్రం చాలా అసౌకర్యంగా ఉంటున్నారని చెబుతున్నారు. 'ఆమె బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, డబ్బు లావాదేవీలు, వడ్డీలు, చక్రవడ్డీల ఉచ్చులో చిక్కుకోకూడదు అని పురుషులు భావిస్తారు. ఆమె కూడా ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టడానికి, ఈఎమ్ఐ కట్టడానికి, ఆస్తిలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపదు. వ్యక్తిగత ఫైనాన్స్, జ్ఞానం, నైపుణ్యాలు, వంటి ఆర్థిక సమాచారం ఉన్నవారు తమ డబ్బుకు సంబంధించి సొంతంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉన్నవారు ఆర్థికంగా అక్షరాస్యులు' అని సునీల్ గాంధీ వివరిస్తున్నారు.

అవగాహనకు మార్గాలు..

- ఆర్థికంగా అక్షరాస్యత ఉన్న మహిళలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది, వేటికి ఎంత ఖర్చు అవుతుంది, ఎంత దుర్వినియోగం అవుతుంది అనే విషయాల పట్ల అవగాహన ఉండాలి. అంతేకాదు, ఏ పథకాల్లో డబ్బు ఉంచడం ప్రయోజనకరం... వంటి అంశాలపై దృష్టి పెట్టడం వల్ల మార్కెట్‌లో ఆర్థిక కదలిక ఏమిటో తెలుస్తుంది.
- ఫిక్స్‌డ్ డిపాజిట్స్, స్కీమ్‌లు, నాన్-డీమ్యాట్ ఇన్వెస్ట్‌మెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి అవగాహన పెంచుకోవాలి.
- మహిళలు తమ భర్త ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారో తప్పక తెలుసుకోవాలి.
- ఏయే రుణాలు తీసుకుంటున్నారు, వాటి కాలపరిమితి ఎంత, వడ్డీ ఎంత అనేది తెలుసుకోవాలి.
- ప్రస్తుతం చాలా లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలు ఆన్‌లైన్ లావాదేవీల మొత్తం ప్రక్రియను తెలుసుకోవాలి.
- మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, బ్యాంకులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీస్, జీవిత బీమాలో పెట్టుబడి పెట్టినట్లయితే ఎప్పుడూ కంబైన్డ్‌గా చేయడం మంచిది. నామినీలో మీ పేరు ఉందో లేదో చెక్ చేయాలి. మీ సొంత బ్యాంకు ఖాతా వివరాలను ఎల్లప్పుడూ అప్‌డేట్‌లో ఉంచండి.

మహిళలను నియంత్రించే ఆయుధం

ఉద్దేశపూర్వకంగానే మహిళలకు 'ఆర్థిక స్వేచ్ఛ' ఇవ్వడం లేదు. కుటుంబంలోని మగవారే దీనిని అడ్డుకుంటున్నారు. భారతీయ స్త్రీలు ఇంటిని చూసుకుంటారు. పురుషులు సంపాదిస్తారు. దీంతో 'తమకు ఏం అవసరమో పురుషులే చూసుకుంటారు' అనే ఆలోచన స్త్రీలను ఆర్థిక స్వేచ్ఛకు దూరం చేస్తుంది. చేతిలో డబ్బు, దానిని ఖర్చు చేసే హక్కు పురుషులకు ఉండటం మహిళలను నియంత్రించే ఆయుధంగా మారింది.

– గీతికా చంద్ర,
'ఫైనాన్స్ బేసిక్స్ ఫర్ ఉమెన్' రచయిత్రి

కొట్టకుండా వేధింపులు

'నేను సంపాదిస్తున్నాను, నా సంపాదనతో ఇల్లు నడుస్తోంది. నేను సంపాదించకపోతే కుటుంబం దిక్కులేనిది అవుతుంది. నేను సంపాదిస్తున్నాను కాబట్టి నా ఇష్టం మేరకు అన్నీ నడవాలి' ఈ తరహా ఆలోచన పురుషుల్లో పెరిగి మహిళలపై వేధింపులకు కారణమవుతోంది. 95 శాతం గృహహింస కేసుల్లో డబ్బు ప్రధానపాత్ర పోషిస్తోంది. చాలా మంది మహిళలు ఈ విధమైన ఆర్థిక వేధింపులకు గురవుతున్నారు.

– సీమీ వినాయక్,
సైకాలజిస్ట్

యూత్ పల్స్

J బ్యూటీకి జై కొడుతున్నారు!



చర్మం జిడ్డుగా లేకుండా ఉండడానికి ఏంచేయాలి? కంటి కింద నల్ల వలయాలను ఎలా తప్పించాలి? ఎండ నుంచి చర్మాన్ని ఎలా రక్షించుకోవాలి? చర్మం మెరవాలంటే ఏం చేయాలి? చర్మసంరక్షణ నుంచి సౌందర్యం వరకు సందేహాల సముద్రంలో ఈదులాడుతున్న యువతరానికి నిన్నా మొన్నటి వరకు 'కె-బ్యూటీ' లేదా కొరియన్ బ్యూటీ చుక్కానిగా కనిపించింది. అయితే ఇప్పుడు యూత్ దృష్టి జె-బ్యూటీ(జపనీస్ బ్యూటీ)పై మళ్లింది. ఇది జపాన్ బ్యూటీ బ్రాండ్‌ల మార్కెటింగ్ మాయాజాలమా? సహజమైన పరిణామమా? అనే చర్చను పక్కనపెడితే 'జె-బ్యూటీ'లోని సహజత్వాన్ని, వాబీ-సాబీ తత్వాన్ని యువతరం బాగా ఇష్టపడుతోంది...

మృదువైన చర్మం కోసం కలలు కనే యువతరానికి చిరపరిచితమైన ట్రెండ్ కె-బ్యూటీ(కొరియన్-బ్యూటీ) బ్యూటీ ఇండస్ట్రీపై భారీ ప్రభావాన్ని చూపించింది. మైండ్-బాగ్లింగ్ ప్రొడక్ట్స్, మల్టీ-స్టెప్ రొటీన్స్‌తో 'కె-బ్యూటీ' గ్లోబల్ సెన్సేషన్‌గా నిలిచింది. యువ ప్రపంచాన్ని అమితంగా ఆకట్టుకుంది.

తాజా విషయానికి వస్తే 'జె-బ్యూటీ' లేదా జపనీస్ బ్యూటీ యువతరం ఫేవరెట్‌గా మారింది. 'పవర్ ఫుల్ సిస్టర్ ఆఫ్ కె-బ్యూటీ' గా పేరు తెచ్చుకున్న 'జె-బ్యూటీ' కె-బ్యూటీని అధిగమించేలా దూసుకుపోతోంది. ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్లతో కలిసి జపనీస్ బ్యూటీ బ్రాండ్‌లు కలిసి పనిచేయడం కూడా మన దేశంలో 'జె-బ్యూటీ' పాపులారిటీకి కారణం అయింది.

'జె-బ్యూటీ'కి ఎందుకు ఇంత పాపులారిటీ వచ్చింది... అనే విషయానికి వస్తే... నిపుణుల మాటల్లో చెప్పాలంటే...'జె-బ్యూటీ'లోని ప్రధాన ఆకర్షణ సింప్లిసిటీ, ఎఫెక్టివ్‌నెస్. 'ప్రివెన్షన్ రాదర్ దేన్ కరెక్షన్ '

తత్వంతో కూడిన ఈ విధానం హ్యాపీగా, హెల్తీగా ఉండేలా చర్మ సంరక్షణతోపాటు పర్యావరణ ఒత్తిళ్ల నుంచి రక్షణకు ప్రాధాన్యత ఇస్తుంది, గ్రీన్ టీ, రైస్ బ్రాన్, సీవీడ్‌లాంటి పొటెంట్ ఇన్‌గ్రేడియెంట్స్ 'జె-బ్యూటీ'లో భాగం అయ్యాయి.

'ఘుమఘుమలతో కూడిన ఖరీదైన వంటకాల కంటే సాదాసీదా పప్పన్నం ఎంచుకోవడం లాంటిదే జె-బ్యూటీ. దీనిపై జపనీస్ తత్వం వాబీ-సాబీ ప్రభావం ఉంది. ఇంపర్‌ఫెక్షన్, సింప్లిసిటీ నుంచి అందాన్ని దర్శించడమే వాబీ -సాబీ తత్వం. జె-బ్యూటీ ప్రాథమికంగా రెండు విషయాలపై దృష్టి పెడుతుంది. వర్తమానంలో చర్మ సౌందర్యం. రెండోది భవిష్యత్తులో చర్మ సమస్యలు రాకుండా నివారించడం' అంటుంది ముంబైకి చెందిన డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్ డాక్టర్ శిఖా షా.

జపనీస్ కల్చర్ అండ్ లైఫ్‌స్టైల్‌పై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెరగడం కూడా మన దేశంలో 'జె-బ్యూటీ'పై ఆసక్తి కలిగించే కారణాలలో ఒకటి.

'ఆరోగ్యకరమైన, ప్రకాశవంతమైన చర్మం కోసం 11-12 స్టెప్ స్కిన్‌కేర్ రొటీన్ అవసరం అనే అపోహను జె- బ్యూటీ బ్రేక్ చేసింది' అంటుంది డాక్టర్ మోనికా బాంబ్రూ.

'కె-బ్యూటీ'తో పోల్చితే 'జె-బ్యూటీ'ని ప్రత్యేకంగా ఉంచుతున్నదేమిటి? అనే విషయానికి వస్తే...

చర్మసంరక్షణ విషయంలో రెండిటికీ పేరు ఉన్నప్పటికీ వాటి విధానాలు, తత్వం వేరు. 'కె-బ్యూటీ' అనేది ఇన్నోవేషన్, ఎక్స్‌పెరిమెంటేషన్‌పై దృష్టి పెడుతుంది. మల్టీ-స్టెప్ రొటీన్స్, ట్రెండ్-డ్రైవన్ ఫార్ములేషన్స్ ఉంటాయి. ఇక 'జె-బ్యూటీ' అనేది సింప్లిసిటీ, మినిమలిజం, సహజపదార్థాలపై దృష్టి పెడుతుంది.

'జె-బ్యూటీకి తిరుగులేదు' అని అంటుంది ముంబైకి చెందిన అద్విక శ్రీవాస్తవ. 'జె-బ్యూటీ'పై కొండంత ఇష్టం లోనూ ఆచితూచి ఆలోచించేవారు లేకపోలేదు. ఇందుకు ఉదాహరణ బెంగళూరుకు చెందిన చైత్ర.

'కె-బ్యూటీతో పోల్చితే జె-బ్యూటీ ఆసక్తికరంగా అనిపిస్తుంది. అలా అని వేలంవెర్రిగా జె-బ్యూటీ ప్రొడక్ట్స్ కొనాలనుకోవడం లేదు. జె-బ్యూటీ గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను' అంటుంది చైత్ర.

క్లీన్ బ్యూటీ ట్రెండ్

గతంలో పోల్చితే జపనీస్ బ్యూటీ కంపెనీలపై యువత ఆసక్తి పెరిగింది. దీనికి అనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలు మారుతున్నాయి...అంటుంది గ్లోబల్ డేటా రిపోర్ట్. 'కె-బ్యూటీ అనేది ట్రెండీ ఇన్‌గ్రేడియెంట్స్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, క్విక్ రిజల్ట్‌కు ప్రాధాన్యత ఇస్తుంటే జె-బ్యూటీ ఇందుకు భిన్నంగా సహజమైన పదార్థాలతో శాశ్వత ప్రభావంపై దృష్టి పెడుతుంది' అంటున్నాడు 'గ్లోబల్ డేటా' కన్స్యూమర్ అనలిస్ట్ మణి భూషణ్ శుక్లా. 'సహజ' 'సేంద్రియ' 'అలెర్జీరహిత' మాటలతో 'జె-బ్యూటీ' 'క్లీన్ బ్యూటీ' ట్రెండ్‌గా పేరు తెచ్చుకుంది.